క్లుప్తంగా

ముత్యాలపేటలో వైభవంగా కొలుపు



పొదలకూరు: మండలంలోని బిరదవోలు పంచాయతీ ముత్యాలపేటలో ఆదివారం రాత్రి వైభవంగా కొలుపు నిర్వహించారు. ఈ సందర్భంగా పోతురాజు, పోలేరమ్మ, గంగమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

కాలువల నిర్మాణానికి శంకుస్థాపన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని పదో వార్డులో డ్రెయినేజీ కాలువల నిర్మాణానికి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.10 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో ఎరటపల్లి శివకుమార్‌రెడ్డి, గుత్తా శ్రీనివాసులు, స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఏఓ తనిఖీ



విడవలూరు: మండలంలోని సొసైటీలు, ఫర్టిలైజర్స్ షాపుల్లో స్థానిక ఏఓ లక్ష్మి సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధరలు, స్టాకు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి డీలర్ తప్పకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. అదేవిధంగా ఖరీఫ్ సీజన్‌లో రైతు సేవా కేంద్రాలు, సొసైటీలు, ప్రైవేటు షాపుల ద్వారా మండలంలో మొత్తం 2000 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని, రానున్న మూడు రోజుల్లో మరో 100 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి సన్నాహాలు చేస్తున్నట్లు తెలియజేశారు.

ఎరువులను అందుబాటులో ఉంచండి

విడవలూరు: చిన్న, సన్నకారు రైతులకు యూరియా, ఎరువులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక వ్యవసాయాధికారి లక్ష్మిని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం ఆమెను కలిసి పలు సమస్యలను వివరించారు. స్థానికంగా ఎరువులు అందుబాటులో లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుని, ఎక్కువ శాతం ఎరువులు సొసైటీ, రైతు సేవా కేంద్రాల్లో విక్రయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట స్థానిక రైతులున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కోవూరు: రాళ్లమిట్ట, మసీదు వీధి ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయిబాబా మందిరం, కాపు వీధి ప్రాంతాల్లో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని డీఈఈ కె.మధుసూదన్‌రెడ్డి సోమవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉంగరం, కమ్మలు చోరీ

నెల్లూరు(క్రైమ్): బీరువాలోని ఉంగరం, కమ్మలు చోరీకి గురైన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని విరాట్‌నగర్‌లో ప్రదీప్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన ఈనెల 8న కుటుంబంతో కలిసి తన అక్క ఇంటి గృహ ప్రవేశ నిమిత్తం పరమేశ్వరీనగర్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి తాళాన్ని గ్రిల్స్ పక్కనే ఉన్న మగ్గులో ఉంచారు. సాయంత్రం ఇంటికి వచ్చి బీరువాను తెరచి చూడగా అందులో ఉన్న తొమ్మిది గ్రాముల కమ్మలు, ఉంగరం కనిపించలేదు. ఈమేరకు బాధితుడు సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

12న 'పెరసం' పురస్కారాల ప్రదానం

నెల్లూరు(బృందావనం): పెన్నా రచయితల సంఘం (పెరసం) 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 2023–24 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన కవితా సంపుటి పోటీల్లో విజేతలకు జూలై 12వ తేదీన పురస్కారాలు అందజేయనున్నట్లు ఆ సంఘ అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి సోమవారం తెలిపారు. ఈ పోటీల్లో విజయనగరం జిల్లా మెంటాడ గ్రామానికి చెందిన పాయల మురళీకృష్ణ కవితా సంపుటి 'గచ్చెం సెట్టుకి అటూ ఇటూ', కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన మిరప మహేష్ కవితా సంపుటి 'పడమటీది నాటకం'లకు లభించినట్లు ఆమె తెలిపారు.వీరికి పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో పురస్కారాల ప్రదానం ఉంటుందన్నారు.

సమస్యల పరిష్కారానికి డిమాండ్

- తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సర్వేయర్ల నిరసన



కొడవలూరు : ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న సర్వేయర్లు

కొడవలూరు: గ్రామ సర్వేయర్ల న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని గ్రామ సర్వేయర్‌ల సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు సాపిరెడ్డి గోపాల్‌కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లకార్డులను ప్రదర్శిస్తూ సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సర్వేయర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై పలు పర్యాయాలు ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేషనలైజేషన్, ట్రాన్స్‌ఫర్‌ల విషయంలో సర్వేయర్‌లకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. సచివాలయ స్టాఫ్‌ను హేతుబద్ధీకరణ చేస్తున్నారని, భూసర్వేయర్‌లైన తమను జనాభా ప్రాతిపదికన కాకుండా రెవెన్యూ విలేజ్ విస్తీర్ణం మేరకు హేతుబద్ధీకరించాలని కోరారు. గ్రామ సర్వేయర్‌లకు స్పెషల్ అలవెన్స్‌లు కల్పిస్తూ ఒకే డిపార్ట్‌మెంట్ సర్వీస్ రూల్స్‌తో పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయపరమైన డిమాండ్‌లు పరిష్కారమయ్యే వరకు పెన్ డౌన్ చేస్తూ శాంతియుత నిరసన తెలుపుతామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్‌లు మనోజ్‌సాయి, మహేంద్ర, శివకుమార్, సుధామణి, శిల్ప, వింధ్య, రేవతి, స్వప్న పాల్గొన్నారు.

- తోటపల్లిగూడూరు: సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ మండల గ్రామ సర్వే ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ సర్వేయర్లు సోమవారం పెన్‌డౌన్ చేసి మండల కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్వేయర్ల అసిసోషియన్ మండలాధ్యక్షుడు కార్తీక్ మాట్లాడుతూ అనేక సమస్యలతో విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అందుకే విధులను వదిలి శాంతియుత నిరసనకు దిగడం జరిగిందన్నారు. స్వర్ణాంధ్ర విజన్ – 2047లో భాగంగా ప్రభుత్వం సచివాలయం స్టాఫ్‌ను హేతుబద్ధీకరణ చేస్తోందన్నారు. భూ సర్వేయర్ల అయిన తమను జనాభా ప్రాతిపదికన కాకుండా రెవెన్యూ విలేజ్ విస్తీర్ణం మేరకు హేతుబద్ధీకరణ చేయాలన్నారు. సర్వేయర్ల సమ్మితితోనే కౌన్సెలింగ్ ద్వారా మహిళా మహిళా ఉద్యోగినులకు ఇతర డిపార్ట్‌మెంట్లకు వెళ్లే అవకాశం కల్పించాలన్నారు. గ్రామ స్థాయి ఉద్యోగులమైన తమకు సొంత మండలాల్లోనే పోస్టింగ్‌లు కల్పించాలన్నారు. సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు ఇవ్వాలన్నారు. అలాగే ఇప్పటి వరకు రీ సర్వే జరిగిన గ్రామాల్లోన్ని గ్రామ సర్వేయర్లకు టీఏడీఏలను వెంటనే విడుదుల చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ పద్మావతికి గ్రామ సర్వేయర్లు వినతిపత్రాన్ని అందించారు.



టీపీగూడూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్వేయర్లు

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి నరసింహారావు

పొదలకూరు: అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ వి.నరసింహారావు అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని తాటిపర్తిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0 నుంచి 6 సంవత్సరాల్లోపు పిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అతిసార వ్యాధికి గురైతే స్వచ్ఛమైన నీటిని అందించాలన్నారు. విటమిన్ ఏ సిరప్ తాగించాల్సిందిగా సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణం తాపించి, జింక్ మాత్రలను మింగించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కె.శ్రీనివాసులు, సరసమ్మ, సహాయకులు మంగమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్కేలు, సొసైటీల్లో యూరియా



తలమంచి సొసైటీలో యూరియా దిగుమతిని పర్యవేక్షిస్తున్న ఏఓ విజయలక్ష్మి

కొడవలూరు: మండలంలోని రైతు సేవా కేంద్రాలు(ఆర్‌ఎస్కేలు), సొసైటీల్లో యూరియా అందుబాటులో ఉందని ఏఓ ఎస్.విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని తలమంచి సొసైటీ, కమ్మపాళెం రైతు సేవా కేంద్రాలకు 38 టన్నుల యూరియాను ఆమె పర్యవేక్షణలో సోమవారం దిగుమతి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 531 టన్నుల యూరియాను ఆర్‌ఎస్కే, సొసైటీల ద్వారా రైతులకు పంపిణీ చేశామన్నారు. రైతులకు ఇంకా యూరియా అవసరమైతే వీఏఏ వద్ద ముందుగా నగదు చెల్లించి ఇండెంట్ పెట్టుకొంటే రెండు లేదా మూడ్రోజుల్లో అందిస్తామని స్పష్టం చేశారు. ఏఓ వెంట ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏ ప్రసాద్ ఉన్నారు.

సీసీ రోడ్ల పరిశీలన



సీసీ రోడ్లును పరిశీలిస్తున్న డీఈ చంద్రశేఖర్

మనుబోలు: మండల పరిధిలోని సంగమేశ్వర గిరిజన కాలనీలో రూ.5 లక్షలతో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డును పంచాయతీరాజ్ డీఈ చంద్రశేఖర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. నాసిరకంగా నిర్మిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మనుబోలు దళితవాడలో బైపాస్ అనుకుని ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి రూ.5 లక్షలతో మరో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పీఆర్ ఏఈ విజయభాస్కర్ ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి వావిళ్ల విద్యార్థినుల ఎంపిక



శ్రీలిఖిత



విష్ణుప్రియ

విడవలూరు: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ ఫేజ్–1 మెరిట్ జాబితాలో వావిళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌కు చెందిన పి.శ్రీలిఖిత, పి.విష్ణుప్రియ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.చెంచు రామయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను సోమవారం ఆయన అభినందించారు. కాగా తమ గ్రామానికి చెందిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించడంతో పాఠశాల సిబ్బందితో పాటు ఎస్‌ఎంఎస్ చైర్మన్ పి.కల్యాణి, వైస్ చైర్మన్ శివ, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఇంట్లోకి చొరబడి వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిపై అకారణంగా ఇద్దరు యువకులు కర్ర, రాడ్డుతో దాడి చేశారు. అనంతరం అతన్ని ఈడ్చుకుంటూ తీసుకెళ్తుండగా బాధితుడు వారినుంచి తప్పించుకుని పరారయ్యారు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. మూలాపేట ఇరుగాళమ్మ సంఘంలో బి.అశోక్ నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, పిల్లలున్నారు. అశోక్ ఆర్టీసీ బస్టాండ్‌లోని న్యూడిల్స్ షాపులో మాస్టర్‌గా పనిచేస్తుండగా, అతని భార్య చేపల మార్కెట్‌లో పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి కరెంట్ లేని కారణంగా అశోక్ తలుపు తీసి ఇంట్లో పడుకుని ఉండగా అతని భార్య పిల్లలను తీసుకుని ఇరుగాళమ్మ గుడి వద్ద పడుకునేందుకు వెళ్లారు. అర్ధరాత్రి అశోక్ ఇంట్లోకి రాజేష్, బుడ్డా అనే ఇద్దరు యువకులు అక్రమంగా ప్రవేశించారు. తమ వెంట తెచ్చుకున్న కర్ర, రాడ్డుతో అశోక్‌పై దాడిచేశారు. ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించినా యువకులు వినిపించుకోలేదు. అశోక్‌ను ఇంట్లో నుంచి ఈడ్చుకుంటూ బయటకు తీసుకొచ్చి దాడి చేస్తుండగా ఆయన తప్పించుకుని పరారయ్యారు. ఓ చెట్టు కింద పడిపోయారు. సోమవారం తలకు తీవ్రగాయాలతో పడి ఉన్న ఆయన్ను భార్య చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు చిన్న బజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

గైనకాలజీ డాక్టర్ బదిలీ

పొదలకూరు: స్థానిక సీహెచ్‌సీలో సుదీర్ఘకాలం గైనకాలజిస్ట్ (గర్భకోశ వ్యాధి నిపుణులు)గా పనిచేసిన డాక్టర్ పద్మావతి బదిలీ అయ్యారు. ఈమె అల్లూరు సీహెచ్‌సీలో బాధ్యతలు స్వీకరించారు. పద్మావతి సుమారు ఆరేళ్లపాటు ఇక్కడ పనిచేశారు. సీహెచ్‌సీ స్టాఫ్ నర్సు పద్మాంజలి గూడూరు ఏరియా ఆస్పత్రికి బదిలీపై వెళ్లారు.

పోస్టు ఖాళీ

పద్మావతిని బదిలీ చేసిన అధికారులు ఆమె స్థానంలో మరొకరిని నియమించలేదు. దీంతో సీహెచ్‌సీలో గర్భకోశవ్యాధి నిపుణుల పోస్టు ఖాళీ అయ్యింది. పొదలకూరు సీహెచ్‌సీ చుట్టుపక్కల గ్రామాలే కాక మండలాలకు కూడా కేంద్రంగా ఉంది. ఫలితంగా గర్భిణులు ఇక్కడ ప్రతి గురువారం స్కానింగ్ చేయించుకుంటుంటారు. తప్పనిసరిగా గైనకాలజీ పోస్టును భర్తీ చేయాల్సి ఉంది.

బోరు నిర్మాణం

పొదలకూరు: మండలంలోని మరుపూరు గ్రామం చెరువుకు సమీపంలో గిరిజనుల నివాసం అంకమ్మతల్లి మాను వద్ద బోరు నిర్మాణం చేపట్టారు. మండల నిధులతో బోరు నిర్మాణం పూర్తి చేసినట్లు వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. అంకమ్మతల్లికి భక్తులు పొంగళ్లు పెట్టుకునేందుకు నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడేవారన్నారు. బోరు నిర్మాణంతో ఇబ్బందులు తొలగిపోయాయన్నారు.

నేడు ఆంజనేయస్వామికి పూజలు

పొదలకూరు: పట్టణంలోని మారుతి నగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహిస్తారని ఉభయకర్తలైన నాయీబ్రాహ్మణ సేవాసంఘం వారు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆకుపూజ, అభిషేకం, సాయంత్రం పల్లకి సేవ, గ్రామోత్సవం జరుగుతాయని వెల్లడించారు.

అట్రాసిటీ కేసుల విచారణ

పొదలకూరు: మండలంలోని ఆర్‌వైపాళెం, చెన్నారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన వారి ఫిర్యాదు మేరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సోమవారం నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు విచారించారు. ఆర్‌వైపాళెం గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్‌గా పనిచేస్తూ బదిలీ అయిన కృష్ణవేణి అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లురెడ్డి వేధింపులకు గురిచేస్తున్నాడని గతనెలలో ఫిర్యాదు చేయడంతో పోలీసులు అట్రాసిటీ కేసును నమోదు చేశారు. చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అదే గ్రామానికి చెందిన పెంచలరెడ్డి కాలువ నీటిని పెట్టుకునే విషయంలో గొడవ పడి దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను డీఎస్పీ ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. డీఎస్పీ వెంట పొదలకూరు ఎస్సై ఎస్కే హనీఫ్ ఉన్నారు.

ఆశా పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఇందుకూరుపేట: మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మైపాడు సచివాలయం –1లో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్టు కోసం దరఖాస్తులు చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ శ్రావణి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి 25 నుంచి 45 ఏళ్లలోపు వారు అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జొన్నవాడ వద్ద పెన్నానది మధ్యలో ఇసుక లోడుతో ట్రాక్టర్



అనుమతుల్లేకున్నా.. యథేచ్ఛగా..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని మినగల్లు, జొన్నవాడ, కాగులపాడు, పెనుబల్లి వద్ద పెన్నానది నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఓపెన్ రీచ్‌ల నుంచి ఇసుక తరలించేందుకు అనుమతులు లేకపోయినా అక్రమార్కులు ఇవేవీ పట్టించుకోవడం లేదు. వందల కొద్దీ ట్రాక్టర్లతో నేరుగా నదిలోకి వెళ్లి ఇసుకను తవ్వేస్తున్నారు. దీంతో నది రూపురేఖలు మారి ఎక్కడ చూసినా పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. ఇసుక అక్రమంగా తరలిస్తున్న వారిపై నిఘా ఉంచాల్సిన మైనింగ్ అధికారులు పత్తాలేకుండా పోయారు. అధికారులు అక్రమ ఇసుక తరలింపుపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు నాటకం తిరుమలయ్య, కె.వెంకటేశ్వర్లు, రంగారావు, చెంచయ్య, పెంచలయ్య, సుజాతలను ఆ పాఠశాలలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఎ.మోహన రామలింగయ్య మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు పాఠశాలలో ఏనిమిదేళ్ల పాటు పనిచేసి ఎంతో మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేశారని కొనియాడారు. వీరిని సన్మానించుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కట్టా ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మాల్యాద్రి, వీఆర్వోలు సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, మహిళా పోలీసు హెబ్సిబా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర ప్రతిఒక్కరి బాధ్యత



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: స్వచ్ఛాంధ్ర సాధించడం ప్రతిఒక్కరి బాధ్యత అని బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించారు. రికార్డుల గదితో పాటు మిగతా గదులను శుభ్రం చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ సిబ్బంది నెలకోసారైనా తమ గదులను శుభ్రం చేసుకునే విధంగా ప్లాన్‌ను రూపొందించుకోవాలని సూచించారు. ఎవరికివారు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా స్వచ్ఛాంధ్ర సాకారమవుతుందని వివరించారు. కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరుకు బస్సు సర్వీస్

- డిపో మేనేజర్ మురళీకృష్ణ



మాట్లాడుతున్న డీఎం మురళీకృష్ణ

పొదలకూరు: ప్రజల విజ్ఞప్తి మేరకు పొదలకూరు నుంచి నిత్యం తెల్లవారుజామున 4.30 గంటలకు జిల్లా కేంద్రమైన నెల్లూరుకు బస్సు సర్వీసును ఏర్పాటు చేస్తున్నట్లు నెల్లూరు ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ కేవీ మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను సోమవారం డీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల నెల్లూరు ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి బస్టాండ్‌ను తనిఖీ చేశారని, పట్టణంలోని కొందరు తెల్లవారుజామున బస్సు సర్వీసు గురించి వెల్లడించినట్టు తెలిపారు. చైర్మన్ సూచన మేరకు బస్సు సర్వీసును ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. నెల్లూరు నుంచి రాత్రి 9.45 గంటలకు బస్సు బయలుదేరి స్థానిక రామ్‌నగర్‌గేటు సెంటరులో నైట్ అవుట్ ఉండి తెల్లవారుజాన బయలుదేరుతుందన్నారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు ఆత్మకూరు బస్టాండ్ వరకు సర్వీసును నడుపుతామన్నారు. ఇందువల్ల ఆత్మకూరు బస్టాండ్‌కు దగ్గరలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఆర్టీసీ ఎల్లవేళల ప్రయాణికుల సౌకర్యం కోసం పనిచేస్తుందన్నారు. పొదలకూరు నుంచి మెగా సిటీలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపే ఆలోచన ఉందని, త్వరలోనే అమల్లోకి తీసుకురావడం జరుగుతుందన్నారు.

వైభవంగా రథోత్సవం



విడవలూరు: రామతీర్థంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరుని దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం వైభవంగా జరిగింది. తొలుత రథాన్ని, దేవుని విగ్రహాన్ని పూలతో అందంగా ముస్తాబు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథానికి కట్టిన తాడును లాగుతూ హరహర శివనామ స్మరణతో పులకించిపోయారు. కాగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై పి.నరేష్ బందోబస్తు ఏర్పాటు చేయగా, ఆలయ ఈఓ మల్లికార్జునరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు ఏర్పట్లను పర్యవేక్షించారు. కార్యక్రమానికి శంభుని కాపుల సంఘం వారు, తంబి శ్రీనివాసులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, ఆలయ చైర్మన్ అత్తిరాల సురేష్ పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనాల పట్టివేత



సీజ్ చేసిన వాహనాల వద్ద ఎస్సై సంతోష్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న మూడు వాహనాలను సోమవారం తెల్లవారుజామున కాగులపాడు, దామరమడుగు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఇష్టారాజ్యంగా చికెన్ వ్యర్థాలు తరలిస్తున్నారన్న సమాచారంతో దామరమడుగు, కాగులపాడు తదితర ప్రాంతాల్లో తమ సిబ్బందితో నిఘా ఉంచామన్నారు. తనిఖీలు నిర్వహించగా ఏచర్, ఆటో, బొలెరో వాహనాల్లోని 45 డ్రమ్ముల చికెన్ వ్యర్థాలు తరలిస్తుండటంతో వాటిని సీజ్ చేశామన్నారు. వ్యర్థాలను మత్స్యశాఖ అధికారి పొట్టియ్య ఆధ్వర్యంలో పూడ్చివేశామని వివరించారు.